## ప్రభుత్వం విడుదల చేసిన అర్హుల జాబితా

| ప్రాంతం | సంఖ్య |
|---|---|
| ఆదిలాబాద్ మున్సిపాలిటీ | 3,012 |
| ఉట్నూర్ | 1,792 |
| ఇచ్చోడ | 1,390 |
| ఇంద్రవెల్లి | 1,275 |
| బజార్‌హత్నూర్ | 1,058 |
| తలమడుగు | 999 |
| గుడిహత్నూర్ | 949 |
| ఆదిలాబాద్ రూరల్ | 937 |
| నేరడిగొండ | 904 |
| బోథ్ | 874 |
| నార్నూర్ | 833 |
| గాదిగూడ | 725 |
| భీంపూర్ | 705 |
| సిరికొండ | 613 |
| బేల | 544 |
| జైనథ్ | 472 |
| సోనాల | 470 |
| బోరజ్ | 366 |
| తాంసి | 339 |
| మావల | 116 |

### ❖ రేషన్‌కార్డు వచ్చేలా చూడాలి..



మేము కూలీ పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతాం. రేషన్‌కార్డులేక బియ్యం, ఇతర ప్రభుత్వ పథకాలు పొందడం లేదు. రేషన్‌కార్డు కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నాం. మీ సేవ, ప్రజాపాలనలో దరఖాస్తులు ఇచ్చినం. కులగణనలో కూడా సర్వే కోసం వచ్చిన సిబ్బందికి వివరాలు తెలిపాం. రేషన్‌కార్డుల పరిశీలనకు వచ్చిన వారి వద్ద ఉన్న జాబితాలో మా పేర్లు లేవు. అధికారులు స్పందించి రేషన్‌కార్డు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

**- రాజేశ్వరి, శాంతినగర్(33 వార్డు) ఆదిలాబాద్**



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

# వయోవృద్ధుల సంక్షేమానికి కార్యక్రమాలు

● **మాజీ మంత్రి జోగు రామన్న**

ఎదులాపురం, జనవరి 16 : వయోవృద్ధుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో వయోవృద్ధుల సమాఖ్య నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీనియర్ సిటిజన్ నూతన సంవత్సర కాన్పడ రేషన్ ప్యాకెట్ క్యాలెండర్‌ను రామన్న చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ.. వయోవృద్ధుల కోసం గత బీఆర్‌ఎస్ అనేక కార్యక్రమాలు చేపట్టి సంక్షేమానికి కృషి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండే, కార్యదర్శి రాంకులకర్ణి, పల్ల సత్యనారాయణ, కిషన్, నర్సిములు, ప్రకాశ్, మోహన్, ప్రేమ్జ, కిశోర్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్ పట్టణంలోని 45వ వార్డులో రేషన్ కార్డు లబ్ధిదారుల ఎంపిక కోసం వివరాలను సేకరిస్తున్న అధికారులు

# రేషన్ గందరగోళం

## ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో పేర్లు గల్లంతు

● **కేవలం 18,741 మందితోనే లిస్టు విడుదల** ● **ఆందోళన చెందుతున్న అర్హులు**

● **పేర్లు రానివారు గ్రామసభల్లో దరఖాస్తు సమర్పించాలి..**

ఆదిలాబాద్, జనవరి 16(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ పట్టణంలోని 33వ వార్డులో 200 మంది రేషన్‌కార్డు లేని వారు ఉన్నారు. వీరిలో చాలా మంది కూలీ పనులు, కులవృత్తులు, చిరు వ్యాపారాలు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రేషన్‌కార్డుల అర్హుల క్షేత్రస్థాయి పరిశీలన జాబితాలో కేవలం 53 మంది పేర్లు మాత్రమే వచ్చాయి. వీరందరూ రేషన్ కార్డుల కోసం మీ సేవ కేంద్రాలతోపాటు ప్రజాపాలనలో దరఖాస్తులు సమర్పించారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో తమకు రేషన్‌కార్డు లేదని సర్వేకు వచ్చిన సిబ్బందికి సూచించారు. రేషన్‌కార్డు వస్తుందని ఎదురుచూస్తున్న వీరికి నిరాశే మిగిలింది. తన వార్డులో 200 మంది పేదలు రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న, కులగణనలో వివరాలు రాయించిన వారి పేర్లు జాబితాలో లేవని వార్డు కౌన్సిలర్ అలాల అజయ్ తెలిపారు. పేదలు రేషన్‌కార్డుల జాబితాలో తమ పేర్లు లేవని అడుగుతున్నారని, ఏమి సమాధానం చెప్పలేక పోతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రధాన వార్డు కౌన్సిలర్ తమ వార్డులోని 400 మంది వరకు పేదలు ఉన్నారని, జాబితాలో కేవలం 43 మంది పేర్లు మాత్రమే వచ్చాయని, ఇలా ఎందుకు జరిగిందని మున్సిపాలిటీకి వచ్చి కమిషనర్‌తో మొర పెట్టుకున్నారు. పట్టణంలోని 49 వార్డుల్లో కూడా రేషన్‌కార్డుల జాబితా పరిస్థితి ఇలాగే ఉంది. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది దరఖాస్తులు సమర్పించగా.. కేవలం 18,741 మందికి రేషన్‌కార్డుల లబ్ధిదారుల ఎంపిక జాబితాలో పేర్కొన్నారు. జాబితాలో చాలా మంది పేర్లు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీతో పాటు గ్రామాల్లో పరిశీలనకు వచ్చిన సిబ్బందిని తమ పేర్లు ఉన్నాయా అని తెలుసుకుంటున్నారు. జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవని సిబ్బందిని అడిగితే గ్రామసభలో దరఖాస్తు ఇవ్వాలని చెబుతున్నారని దరఖాస్తుదారులు అంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల వద్దకు వచ్చి జాబితాలో తమ పేర్లు లేవంటూ ఆందోళన చెందుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు ఏమి చేయాలో తెలియడం లేదు.

### ❖ కులగణనలో వివరాలు ఇచ్చిన..



కూలీ పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతాం. రేషన్‌కార్డు కోసం ప్రజాపాలనలో దరఖాస్తు ఇవ్వడంతోపాటు కులగణన సర్వే కోసం వచ్చిన సిబ్బందికి రేషన్‌కార్డు లేదని వివరాలను తెలిపాం. కార్డు వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నాం. మా వార్డుకు వచ్చిన మున్సిపల్ సిబ్బంది వద్ద ఉన్న జాబితాలో మా పేర్లు లేవు. ఎవరిని సంప్రదించాలో తెలియడం లేదు. ప్రభుత్వం పేదలందరికీ రేషన్‌కార్డులు అందజేయాలి.

**- అరుణ, 33 వార్డు, ఆదిలాబాద్**

### ❖ అర్హులకూ ఇవ్వాలి..



ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు పంపిణీ చేయాలి. ప్రభుత్వ పథకాల ఎంపికలో రేషన్‌కార్డును పరిగణలోకి తీసుకోవడంతో పేదలు నష్టపోతున్నారు. మా వార్డులో 200 మంది ప్రజాపాలన, కులగణన సర్వే సిబ్బందికి వివరాలను అందించారు. ప్రభుత్వం విడుదల చేసిన క్షేత్రస్థాయి పరిశీలన జాబితాలో మా వార్డులో కేవలం 53 మంది పేర్లు మాత్రమే ఉన్నాయి. అధికారులను అడిగితే ప్రభుత్వం పంపిన జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారుల ఎంపిక చేస్తామని అంటున్నారు. ప్రజలు మా వద్దకు వచ్చి జాబితాలో తమ పేర్లు లేవని అడుగుతున్నారు. ఏమని సమాధానం చెప్పాలో తెలియడం లేదు .

**- అలాల అజయ్, కౌన్సిలర్, 33 వార్డు, ఆదిలాబాద్ మున్సిపాలిటీ**

# మరమ్మతు పనుల్లో నాణ్యత పాటించాలి..

● **ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చంద్రమోహన్**

ఇంద్రవెల్లి, జనవరి 16 : కేస్లాపూర్ నాగోబా జాతరను పురస్కరించుకుని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లతోపాటు మరమ్మతు పనుల్లో నాణ్యత పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చంద్రమోహన్ అన్నారు. గురువారం నాగోబా జాతర ఏర్పాట్ల పనులతోపాటు మరమ్మతు చేసిన మరుగుదొడ్లు, నీటి ట్యాంకులను పరిశీలించారు. మరుగుదొడ్లతో పాటు స్నానంపు గదుల వివరాలను ఏఈ భానుకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోవాడ్ ప్రాంతంతో పాటు మర్రిచెట్ల ప్రాంతం, దర్బార్ ప్రాంతంలోని మరుగుదొడ్లు, స్నానపు గదుల ను పరిశీలించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో గోవాడ్‌కు సున్నంతోపాటు రంగులు వేసే పనులు, హెలిప్యాడ్ గ్రౌండ్‌తోపాటు గో వాడ్ ప్రాంతం, పోలీస్ క్యాంప్ ఏర్పాటు స్థలం, మర్రిచెట్ల ప్రాంతం, తైబజార్ ఏర్పాటు స్థలంలో బ్లేడ్ ట్రాక్టర్‌తో భూమి చదును పనులు చేసినట్లు ఆలయ ఈవో రాజమౌళి తెలిపారు. కేస్లాపూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గోవాడ్ ప్రాంతంలోని నీటి ట్యాంకులు, మర్రిచెట్ల ప్రాంతంలోని నీటి ట్యాంకుల వద్ద పారిశుధ్య పనులతోపాటు నీటి ట్యాంకుల శుభ్రత పనులు చేస్తున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి మహ్మద్ మోతేశాం తెలిపారు.



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చంద్రమోహన్

# ట్రాన్స్‌జండర్లకు వైద్య సలహాలు

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 16 : నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాల దవాఖానలో మైత్రి క్లినిక్‌లో భాగంగా ట్రాన్స్‌జండర్లకు గురువారం వైద్యులు ఆరోగ్య, వైద్య సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రవి, సీడీపీవో నాగమణి, ట్రాన్స్‌జండర్స్ జిల్లా అధ్యక్షురాలు సిరి పాల్గొన్నారు.

# రిమ్స్ ఆస్పత్రికి చెత్తబండ్ల అందజేత

ఎదులాపురం, జనవరి 16 : రిమ్స్ ఆస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి కృష్ణ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో మూడు తోపుడు బండ్లతోపాటు ఒక రిక్షాను ఇచ్చారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ.. రిమ్స్ ఆస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చెత్త ఎక్కువగా ఉంటుందనే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని తోపుడు బండ్లను ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినోద్, సూపర్‌వైజర్ రవి, ప్రకాశ్, జాకీర్, చందు, అజ్జు ఖాన్ పాల్గొన్నారు.

# అర్హులను గుర్తించాలి

● **కలెక్టర్ రాజర్షి షా**
● **సిరికొండ మండలంలో పర్యటన**

ఇచ్చోడ(సిరికొండ), జనవరి 16 : ప్రభుత్వ పథకాల కోసం అర్హులైన ప్రతి లబ్ధిదారుడిని గుర్తించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం సిరికొండ మండలంలోని రాయిగూడ, పొన్న, సిరికొండలో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా రైతుభరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారుల ఎంపిక విషయంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా గ్రామంలో తిరుగుతూ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారును పకడ్బందీగా గుర్తించాలన్నారు. అనర్హులను లబ్ధిదారుల జాబితాలో చేర్చొద్దని, చేరిస్తే పూర్తి బాధ్యత అధికారులదే అని పేర్కొన్నారు. మండల నాయకులు శ్మశాన వాటిక నిర్మించాలని, ఉర్దూ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ వెంట ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, డీఎల్‌పీవో ఫణిందర్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో సంతోష్‌కుమార్, తహసీల్దార్ తుకారం పాల్గొన్నారు.



సిరికొండలోని రాయిగూడలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

**ఇచ్చోడలో జేసీ పర్యటన..**

జున్ని, అడిగామ(కే), అడిగామ(బీ), ఇచ్చోడలలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్యామలదేవి పర్యటించారు. ఈ సందర్భంగా రైతుభరోసా పథకం కోసం వ్యవసాయ, వ్యవసాయేతర భూముల సర్వేను పరిశీలించారు. వ్యవసాయేతర భూములు, లే అవుట్లు, ఫ్యాక్టరీలు, సాగులో లేని భూములను రైతు భరోసా పథకం నుంచి తొలగించారు. ఆమె వెంట వ్యవసాయ శాఖ ఏడీ రామకిషన్, మండల వ్యవసాయాధికారి జాదవ్, కైలాశ్, ఏఈవో జీవన్ నాయక్, తహసీల్దార్ సత్యనారాయణ ఉన్నారు.

# విధుల్లో చేరిన డీఈవో ప్రణీత

ఎదులాపురం, జనవరి 16 : ఆదిలాబాద్ డీఈవో ప్రణీతకు ఈ నెల 7వ తేదీన గుండెపోటు వచ్చింది. దీంతో తొమ్మిది రోజులుగా దవాఖానలో చికిత్స తీసుకున్నారు. ఆరోగ్యం కుదుటపడడంతో గురువారం జిల్లా విద్యా శాఖ కార్యాలయానికి వచ్చి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, పలువురు మండల విద్యాధికారులు, సంఘం నాయకులు ఆమెను చాంబర్‌లో కలిశారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

# సేవే లక్ష్యంగా పని చేస్తున్నాం..

ఎదులాపురం, జనవరి 16 : కులమతాలకు అతీతంగా సేవే లక్ష్యంగా పని చేస్తున్నామని జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఖాలిద్ ముబాషిర్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా తొలి రోజు గురువారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. జిల్లాలో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు మద్దతు ధర కల్పించాలన్నారు. తమ సంస్థ అట్టడుగు వర్గాల సంక్షేమానికి పని చేస్తుందన్నారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ ఎంకేఎం జాఫర్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎండీ నదీమ్ అర్షద్, జమాత్ ఇ ఇస్లామీ హింద్ సభ్యులు మహమూద్ అలీ, అమీర్ ముకామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జమతే ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఖాలిద్



ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

# హైమాస్ట్ లైట్లు ప్రారంభం

బోథ్, జనవరి 16 : మర్లపల్లి గ్రామంలో గురువారం రాత్రి గ్రామస్తులు హైమాస్ట్ లైట్లను పూజలు చేసి ప్రారంభించారు. హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు గ్రామస్తులు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే మూడు చోట్ల లైట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. వాటి నిర్మాణం పూర్తి అవ్వడంతో గ్రామస్తులు పూజలు చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవేందర్, రాము పాల్గొన్నారు.

# డమ్మీ తుపాకీతో బెదిరించిన వ్యక్తిపై కేసు

మంచిర్యాల అర్బన్, జనవరి 16 : బార్‌కు వచ్చి పుల్లుగా మద్యం సేవించిన ఓ వ్యక్తి.. బిల్లు కట్టకుండా డమ్మీ తుపాకీతో బెదిరించి పారియిన ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి చోటు చేసుకున్నది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఇందూ బార్‌లోకి బుధవారం రాత్రి ఓ వ్యక్తి వచ్చి టేబుల్ దగ్గర కూర్చొని మందు ఆర్డర్ చేసుకున్నాడు. పుల్లుగా తాగిన తర్వాత బిల్లు చెల్లించకుండా ఇంకా మద్యం కావాలంటూ డమ్మీ తుపాకీతో బెదిరించాడు. అది డమ్మీ తుపాకీ అని అనుమానం వచ్చిన సర్వర్ పోలీసులకు ఫిర్యాదు చేస్తామనగానే సదరు వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. ఆ తర్వాత పోలీసులు విచారణ చేపట్టారు. కాగా, బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లి గ్రామానికి చెందిన పొనగంటి రాజుగా గుర్తించారు. బార్ ఓనర్ ఏవూరి జగన్మోహన్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# గిరి గ్రామాల్లో 60 శాతం రక్తహీనత

● **ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా**
● **పెద్దాపూర్‌లో వైద్య శిబిరం ప్రారంభం**
● **కాలినడకన పావుగూడకు చేరుకున్న అధికారి**




మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

కాసిపేట, జనవరి 16 : గిరిజన గ్రామాల్లో 60 శాతం మంది రక్తహీనతతో బాధ పడుతున్నారని, ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. గురువారం ఆదివాసీ గిరిజన గ్రామం పెద్దాపూర్‌లో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు పలు సమస్యలపై ఆమెకు వినతి పత్రాలు అందించారు. పావుగూడ ఆదివాసీ గిరిజన గ్రామాన్ని సందర్శించాలని గ్రామస్తులు కోరడంతో పీవో కాలి నడకన పత్తి చేలను దాటుకుంటూ అక్కడికి చేరుకున్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని, తప్పకుండా ఊట్నూర్‌కు రావాలని సూచించారు. డ్రాపౌట్ పిల్లలను గుర్తించి తప్పకుండా చదువుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. వైద్య శిబిరంలో మొత్తం 146 మందికి పరీక్షలు చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభించాల్సిన వైద్య శిబిరాన్ని మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించడంతో పలువురు అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్, అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్, ఆర్‌ఎంవో భీష్మా, డి ప్యూటీ డీఎంహెచ్‌వోలు సుధాకర్ నాయక్, అనిత, ఎన్‌సీడీ పీవో ప్రసాద్, వైద్యాధికారి రవి కిరణ్, వైద్యులు శివ ప్రతాప్, శ్రీ దివ్య, మంచిర్యాల దవాఖాన వైద్యులు, కాసిపేట పీహెచ్‌సీ సిబ్బంది, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, ఆదివాసీ నాయకులు కొమ్ముల బాపు, ఆత్రం మహేశ్ పాల్గొన్నారు.

# లబ్ధిదారుల ఎంపికను పకడ్బందీగా నిర్వహించాలి

● **కలెక్టర్ అభిలాష అభినవ్**




మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 16 : ప్రభుత్వం ఈనెల 26వ తేదీ నుంచి అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపికను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్‌లతోపాటు వివిధ శాఖల అధికారులతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ నెల 26 తేదీ నుంచి అమలు చేయనున్న పథకాల అర్హులైన లబ్ధిదారుల ఎంపికను ఈనెల 19వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హులను గుర్తించాలన్నారు. ఏవైనా సందేహాలుంటే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం నంబర్ 6305646600 ను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, జడ్పీ సీఈవో గోవింద్, సీపీవో జీవరత్నం, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డీఎస్‌వో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.